క్లుప్తంగా

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

వేంసూరు: రైతులు అవసరాలను ఆసరాగా చేసుకొని అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి తెలిపారు. గురువారం మండలంలోని వెంకటాపురంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను పరిశీలించి మాట్లాడారు. ఎరువుల నిల్వలు, ధరలు పట్టికలో సూచించాలని తెలిపారు. మండలంలోని భీరపల్లి యూరియా రూ.300, కూలీ చార్జీ రూ.10 విక్రయిస్తున్నారని రైతులు ఏఓ దృష్టికి తీసుకొచ్చారు.

అంకితభావంతో పని చేయండి



బహుమతులు అందజేస్తున్న డీఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లిటౌన్: ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి ఆర్టీసీని లాభాలబాటలో పయనించేందుకు కృషి చేయాలని ఆర్టీసీ డీఎం యు.రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం డిపోలో అత్యధిక కేఎంపీఎల్ సాధించిన ఉద్యోగులకు బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో ఎంఎఫ్ సిరివేరు సాహితి, వీబీఓ కిన్నెర ఆనంద్ పాల్గొన్నారు.

ప్రీస్కూల్ విద్యపై అవగాహన

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధిర ప్రాజెక్ట్ పరిధిలోని ఐదు మండలాల అంగన్‌వాడీ టీచర్లకు గురువారం ఐసీడీఎస్ ఏసీడీపీఓ వీరభద్రమ్మ ప్రీస్కూల్ విద్యపై అవగాహన నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, మాలతి, సుజాత, నాగసత్యావతి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

షార్ట్ ఫిలిం షూటింగ్ పూర్తి



వివరాలు వెల్లడిస్తున్న సమీర్, నటులు

మధిరరూరల్: సందేశాన్ని ఇచ్చేలా 'ఓటు ఎంత?' టైటిల్‌లో రూపొందించిన షార్ట్‌ఫిలిం షూటింగ్ పూర్తయిందని దర్శకుడు, నటుడు ఏఆర్.సమీర్ తెలిపారు. మధిర మండలం ఖాజీపురానికి చెందిన ఆయన గురువారం షార్ట్ ఫిలిం వివరాలు వెల్లడించారు. ఖాజీపురం, ఆత్కూరు గ్రామాల్లో షూటింగ్ నిర్వహించగా, త్వరలోనే మధిర యూట్యూబ్ ఛానల్‌లో విడుదల చేస్తామని తెలిపారు. ఇందులో కపిలవాయి శ్రీధర్‌శర్మ, తన్నీరు చలపతిరావు, అంజి, వై.అనంతరామిరెడ్డి ముఖ్యపాత్రల్లో నటించారని చెప్పారు. గతంలో మాదిరి ఈ షార్ట్ ఫిలింను కూడా మధిర ప్రాంత ప్రజలు ఆదరించాలని కోరారు.

'జయహో రామనుజ'లో సత్తుపల్లి వాసి



శ్రీనివాసరెడ్డి

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లికి చెందిన జానపద నృత్య కళాకారుడు బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి శివుడి పాత్రలో నటించిన జయహో రామనుజ చిత్రం శుక్రవారం విడుదల కానుంది. ఈ చిత్రానికి సాయి వెంకట్ నిర్మాత, దర్శకత్వ బాధ్యతలు నిర్వర్తించారు. ఈమేరకు తెలుగు, కన్నడ, హిందీ, సంస్కృత, మలయాళ భాషల్లో శుక్రవారం విడుదల కానుందని శ్రీనివాసరెడ్డి తెలిపారు. చిత్రాన్ని అందరూ ఆదరించాలని ఆయన కోరారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర

మధిరరూరల్: మండలంలోని నిధానపురం గ్రామంలో గురువారం ముత్యాలమ్మ జాతర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు మంచిగా పండాలని, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుతూ ముత్యాలమ్మ తల్లికి నీళ్ల పోశారు. ఈ నెల 14న ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాదా కృష్ణారెడ్డి, పెదకాపు అమరవాది పున్నారెడ్డి, గ్రామ పెద్దలు వీరారెడ్డి, గురువారెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కవిత రచనా పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

ఎర్రుపాలెం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని జిల్లాస్థాయిలో నేషనల్ గ్రీన్ కార్ప్స్ సంస్థ నిర్వహించిన భూమి పునరుద్ధరణ అనే అంశంపై జరిగిన కవిత రచన పోటీల్లో మీనవోలు శ్రీభాస్కర పాఠశాల విద్యార్థిని అత్యుత్తమ ప్రతిభ చూపి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. డీఈఓ సోమశేఖరశర్మ చేతుల మీదుగా హాసిని బహుమతి అందుకుంది. పాఠశాలకు, మండలానికి పేరు తెచ్చిన విద్యార్థినిని ఎంఈఓ ప్రభాకర్‌రావు, పాఠశాల కరస్పాండెంట్ భట్లపెనుమర్తి సూర్యనారాయణ, డైరెక్టర్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

బిల్లులివ్వట్లే!

అందని మధ్యాహ్న భోజనం బిల్లులు

- పెరిగిన కూరగాయల ధరలతో నిర్వాహకుల అవస్థలు
- నెలనెలా వేతనాలు రాక ఇబ్బందులు
- అప్పులు చేసి వండిపెడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు



ఎర్రుపాలెంలో కట్టెల పొయ్యిపై వంటచేస్తున్న వర్కర్లు

ఎర్రుపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పోషకాహారం అందించాలనే ఉదేదశ్యంతో ప్రభుత్వం హధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. మండలంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు నెలనెలా బిల్లులు రాకపోవడంతో అప్పుల్లో కూరుకుపోయి అవస్థలు పడుతున్నారు. సకాలంలో బిల్లులు అందక వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పదకొండు నెలలుగా ఏజెన్సీలకు బిల్లులు అందడం లేదు. మరోవైపు నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. నిర్వాహకులు అప్పులుచేసి మరీ విద్యార్థులకు భోజనం అందిస్తుంటే.. పలు పాఠశాలల్లో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

మండలంలో అమలవుతున్న తీరు..

మండలంలోని 53 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వండి పెట్టేందుకు గానూ 89 మంది వంట ఏజెన్సీ వర్కర్లు ఉన్నారు. వీరికి చెల్లించాల్సిన బిల్లులు నెలల తరబడిగా పెండింగ్‌లో ఉన్నాయి. ఓవైపు బిల్లులు రాకపోగా.. మరో వైపు వేతనాలు చెల్లించటం లేదు. ఇలా ఐతే ఎలా బతకాలంటూ వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వర్కర్లకు దాదాపు రూ.15 లక్షలకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. దీనికి తోడు సెప్టెంబర్ నుంచి వేతనం రూ.3 వేల చొప్పున ఇవ్వాల్సి ఉండగా అవికూడా చెల్లించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని వంట ఏజెన్సీ నిర్వాహకులు కోరుతున్నారు.

పాఠశాలల్లో లేని వంట గదులు.. పాత్రలకు చిల్లులతో అవస్థలు

మండలంలోని కేశిరెడ్డిపల్లి, లక్ష్మీనగర్, రేమిడిచర్ల, భీమవరం తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో వంట గదులు నిర్మాణానికి నోచుకోలేదు. దీంతో పాఠశాలల ఆవరణలోనే వంట తయారీ చేయాల్సి వస్తుంది. వర్షం కురిసినప్పుడల్లా అగచాట్లు పడుతున్నారు. మరోవైపు వంట తయారీ కోసం ప్రభుత్వం గత 15 ఏళ్ల క్రితం వంట సామగ్రి ఇచ్చారు. అవి కాస్తా పలు పాఠశాలల్లోని వంట పాత్రలకు చిల్లులు పడ్డాయి. సిలిండర్లు ఇస్తామని చెప్పిన పాలకులు ఆదిశగా చర్యలు తీసుకోకపోవడంతో కట్టె పుల్లలతోనే వంట చేస్తున్నారు.

అప్పుల పాలవుతున్నాం..



ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి సంబంధించి బిల్లులు అందించకపోవడంతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం బియ్యం మాత్రమే సరఫరా చేస్తుంది. మిగతా కిరాణా సరుకులు షాపుల్లో కొనుగోలు చేస్తూ అప్పుల పాలవుతున్నాం. గత సంవత్సరం అక్టోబర్ నెల నుండి ఇప్పటి వరకు బిల్లులు ఇవ్వలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లోని బిల్లులు, వేతనాలు విడుదల చేయాలి.

– సూరంశెట్టి ప్రమీలాదేవి, వంట ఏజెన్సీ నిర్వాహకురాలు, ఎర్రుపాలెం

పెంచిన వేతనాలివ్వడం లేదు..



మాకు గత ప్రభుత్వం పెంచిన రూ.3వేల వేతనాలు నేటికీ ఇవ్వడం లేదు. కనీసం గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులైనా చేసుకుందామనుకుంటే.. అధికారులు రానివ్వడం లేదు. ఇటు వేతనాలు ఇవ్వకుండా, మరోవైపు వేరే పనులకు వెళ్లకుండా మేము ఎలా బతకాలి. గుడ్లు, సరుకులకు డబ్బులులేక దుకాణాల్లో అప్పులు కూడా ఇవ్వడం లేదు. సకాలంలో బిల్లులు, వేతనాలిస్తే మాకు ఇబ్బంది ఉండదు.

– కాంద్రు మేరీ సరోజిని, సంఘం మండల అధ్యక్షురాలు, సఖినవీడు

బిల్లుల పెండింగ్ నిజమే..



మధ్యాహ్న భోజనం వర్కర్లకు బిల్లులు చెల్లించాల్సిన విషయం వాస్తవమే. చెల్లించాల్సిన బిల్లులను తయారీ చేసి ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే బిల్లులు వచ్చేలా ఉన్నతాధికారులతో మాట్లాడతాం. రూ.1,000 చొప్పున వర్కర్ల వేతనాన్ని మార్చి నెల వరకు ఇచ్చాం. ప్రభుత్వం పెంచిన వేతనం రూ.2వేలు కూడా సంబంధిత బ్యాంకులకు ప్రభుత్వం జమ చేసింది. అవి కూడా వారి అకౌంట్లలో త్వరలో పడతాయి.

– వై.ప్రభాకర్‌రావు, ఎంఈఓ, ఎర్రుపాలెం

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



వైరా: తహసీల్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు



సత్తుపల్లిరూరల్: తహసీల్దార్ యోగేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

వైరా/సత్తుపల్లిరూరల్/పెనుబల్లి/ఎర్రుపాలెం: విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. తెలంగాణ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో.. వైరా, సత్తుపల్లిరూరల్, పెనుబల్లి తహసీల్ ఎదుట ఆందోళన నిర్వహించి తహసీల్దార్లు కేవీ శ్రీనివాస్, యోగేశ్వరరావు గంటా ప్రతాప్ లను కలిసి వినతిపత్రాలు అందించారు. అదే విధంగా ఎర్రుపాలెంలోని తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించి జూనియర్ అసిస్టెంట్ ఎస్‌కె బాజీబాబాకు వినతిపత్రం అందించగా.. ఆయన సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. రు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పదకొండు సమస్యలు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్నప్పటికీ నగదు రహిత వైద్యమే ప్రధాన సమస్య అని దీని పరిష్కారానికి సీఎం సత్వరమే చర్య తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్లు సీఎంకు వినతిపత్రాలను సీఎం రేవంత్‌రెడ్డికి పంపుతానని సంఘం నాయకులు తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణ, సంఘం నాయకులు చెంచిరెడ్డి, సాంబశివరెడ్డి, సత్తుపల్లి యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు కేశవరెడ్డి, బద్రుద్దీన్, రామిశెట్టి సుబ్బారావు, ఏఎస్ ప్రకాశరావు, కమలకుమారి, మాధవరెడ్డి, మల్లికార్జున్‌రావు, బి.మధుసూదన్‌రాజు, జి.కృష్ణయ్య, అద్దంకి వెంకటరత్నం, నాగేశ్వరరావు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు మిర్యాల నాగేశ్వరరావు, రాఘవరపు కోటేశ్వరరావు, ప్రతాపరెడ్డి, తోట వెంకటేశ్వరరావు, నేరేటి బాబురావు, రాజేశ్వరరావు, వెంకటేశ్వరరావు, అనంత్ పాల్గొన్నారు.

మహిళా శక్తి సంఘాలకు ఈ-సేవా కేంద్రాలు

కల్లూరురూరల్: స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక పరిపుష్టి కల్పించేందుకు గాను ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు మహిళా పొదుపు సంఘాల్లో ఇంటర్మీడియట్ చదివి కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న మహిళలకు ఈ–సేవా కేంద్రాలు మంజూరు చేయనున్నారు. కల్లూరు మండలంలోని చంద్రుపట్ల, పేరువంచ, కప్పలబంధం గ్రామ పంచాయతీల్లో ఈ–సేవా కేంద్రాలు మంజూరైనాయి. ఈ సేవా కేంద్రం కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థి రూ.50వేలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం శ్రీనిధి, లేదా బ్యాంక్ ద్వారా రూ.2 లక్షల వరకు రుణం మంజూరు చేస్తుంది. ఎంపిక చేసిన గ్రామాల్లో ఈ–సేవా కేంద్రం నిర్వహించేందుకు గాను పక్కా ఆర్సీసి బిల్డింగ్ ఉండాలి. గ్రామ పంచాయతీల భవనాల్లో ఈసేవ కేంద్రం కోసం ఒక గదిని ప్రభుత్వం కేటాయించనుంది. ఈ సేవా కేంద్రం ఏర్పాటు చేయనున్న గ్రామంలో నెట్ సౌకర్యం లేకపోతే బ్రాండ్‌బ్రాండ్ సౌకర్యం తప్పనిసరిగా ఉండాలి. కల్లూరు మండలంలోని చంద్రుపట్ల నుంచి 6 దరఖాస్తులు రాగా.. కప్పలబంధం నుంచి 4, పేరువంచ 6 దరఖాస్తులు అందాయి. ఆగస్టు 15వ తేదీ నాటికి మహిళా శక్తి సంఘాల ద్వారా ఈ సేవా కేంద్రాలు ప్రారంభించాలని ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఆసక్తి ఉండి అర్హులైన మహిళ సభ్యులు రెండు రోజుల్లోగా దరఖాస్తులను గ్రామ మహిళా సంఘానికి అందజేయాలని ఐకేపీ ఏపీఎం వెంకటరామారావు కోరారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపీపీ, నాయకులు

తల్లాడ: మండలంలోని కొడవటిమెట్ట గ్రామంలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను గురువారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, అంకిత భావంతో పనిచేసే ఉపాధ్యాయులు ఆ గ్రామం నుంచి బదిలీ అయినా.. పదికాలాల పాటు గుర్తుంటారని తెలిపారు. బదిలీ ఉపాధ్యాయులు స్పందన, వరప్రసాద్‌లను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బద్దం నిర్మల, గ్రామ నాయకులు బద్దం కోటిరెడ్డి, పైడిపల్లి రవి, సునీత, శివరాణి, మోదుగు రజిని, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలగవరం పాఠశాల హెచ్ఎంకు..

మండలంలోని తెలగవరం పాఠశాల హెచ్ఎంగా 13 సంవత్సరాలు పాటు పనిచేసి బదిలీపై వెళ్లిన ఆర్.సాయిరాంను గురువారం గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, వేమిరెడ్డి అచ్చిరెడ్డి, మాజీ సర్పంచులు మురళి, కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ టౌన్–3 ఫీడర్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శరత్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్‌నగర్, రాజీవ్‌రోడ్, కొత్తకొమ్మేపల్లి కాలనీ, ఆర్‌కే ఆస్పత్రి, గుడిపాడురోడ్, వెంగళరావునగర్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. అదే విధంగా టౌన్–2 ఫీడర్‌లో కూడా మరమ్మతులు చేపడుతున్నందున ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థినులకు చేతన ఫౌండేషన్ వితరణ

కొణిజర్ల: మండలంలోని పెద్దగోపతి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల బాలికలకు చేతన ఫౌండేషన్ ఖమ్మం వారు శానిటరీ నాప్కిన్లు వితరణ చేశారు. పాఠశాలలో మొత్తం 95 మంది బాలికలు ఉండగా వారికి ఏడాదికి సరిపడా నాప్కిన్లు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కె.మార్క్ మాట్లాడుతూ.. బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో చేతన ఫౌండేషన్ సభ్యులు మాదినేని నరసింహారావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాయినాధుడికి ప్రత్యేక పూజలు



శ్రీసాయి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని శ్రీసాయిబాబా ఆలయాల్లో బాబాకి గురువారం అర్చకులు సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పూజలు చేశారు. సాయినాధునికి పంచామృతాలతో అభిషేకాలు చేసి, కర్పూర హారతులిచ్చి ఘనంగా పూజలు నిర్వహించారు. భక్తులు భజనలు చేశారు. సాయి గీతాలను ఆలపించారు. అర్చకులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని సాయి నిలయంలో భద్రాచలం, జయంతి, ఎర్రుపాలెం గ్రామాలకు చెందిన అడ్డాల నారాయణస్వామి-సుభాషిణి, ఇప్పల వీరారెడ్డి–అపర్ణ, బోడ బాలాజీ–అనిత దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాయలను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



రాయల నాగేశ్వరరావును సన్మానిస్తున్న ఎల్ఎస్‌సీఎస్ డైరెక్టర్ వనం ప్రదీప్తబాబు

ముదిగొండ: రాష్ట్రగిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా రాయల నాగేశ్వరరావు పదవీ బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు గురువారం హైదరాబాద్ తరలివెళ్లారు. బాధ్యతలు చేపట్టిన రాయలకు కాంగ్రెస్ నేతలు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఎస్‌సీఎస్ డైరెక్టర్ వనం ప్రదీప్తబాబు, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు భద్రారెడ్డి, వల్లభి ఎంపీటీసీ బిక్షం, మాజీ జెడ్పీటీసీ నాగేశ్వరరావు, దేవేంద్రం, పుల్లారెడ్డి, బాస్కర్, మండల యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోనో కార్పస్ మొక్కలు తొలగింపు

వైరా: వైరా ప్రధాన రహదారి డివైడర్లపై గతంలో నాటిన కోనో కార్పస్ మొక్కలను గురువారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ మొక్కలు ఎంతో ప్రమాదకరమైనవని, ప్రజారోగ్యం దృష్ట్యా వాటిని తొలగిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ తెలిపారు. కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ చింతా వేణు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సైదులు పర్యవేక్షించారు.

కూలి పెంచాలని ఆందోళన

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో గురువారం కూలీలు తమ రోజువారి కూలి రూ.300 ఇవ్వాలని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. కూలి రేట్లు తెగేవరకు ఆందోళన విరమించేది లేదన్నారు. ఈ క్రమంలో రైతులు, కూలీల మధ్య చర్చలు జరిగాయి. కూలీలు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రూ.300 ఇవ్వాలని అడగ్గా.. రైతులు మధ్యాహ్నం 2 గంటల వరకు పనిచేయాలన్నారు. ఇద్దరి మధ్య చర్చలు సఫలం కాకపోవడంతో ఎవరిదారిన వారు వెళ్లిపోయారు.

కాలుష్యం పెరుగుతోంది..



ఏన్కూరు: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ఏన్కూరు/ఎర్రుపాలెం: జనాభా పెరగడం వలన కాలుష్యం పెరుగుతోందని ప్రభుత్వ వైద్యాధికారిణి మౌనిక, బనిగండ్ర పాడు పీహెచ్‌సీ వైద్యుడు సాకేత్ రెడ్డి తెలిపారు. గురువారం ఏన్కూరు, ఎర్రుపాలెం మండల కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ శివరాజు, రమణ, సురేష్, డాక్టర్ శశి పూర్ణ, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ రమణారెడ్డి, పుష్పలత, కాంతమ్మ రాణి, వెంకటేశ్వరరావు, దొడ్డా అశోక్, వెంకటేశ్వర రెడ్డి, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోనకల్: మండలంలోని చిన్నబీరువల్లి గ్రామంలో సీఎం రిలీఫ్‌ఫండ్‌చెక్కులను గురువారం పంపిణీ చేశారు. గ్రామపంచాయతీలో పనిచేసే కోట సూరమ్మ భర్త గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందతున్నాడు. సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా 30వేల రూపాయిలు మంజూరయ్యాయి. అదే విదంగా కోటా రామకృష్ణ వైద్యఖర్చులకు గాను 24 వేల రూపాయిలు మంజూరయ్యాయి. వీటిని కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలరాజు, శివాజీ, వెంకట్రావ్, సంజీవ్‌రావ్, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా వాటర్‌ప్లాంట్

కారేపల్లి: తోటకూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా సురక్షితమంచినీటిని అందించడంలో భాగంగా దుబ్బతండా గ్రామపంచాయతీలో వాటర్ ప్లాంట్ నిర్మించడం జరిగిందని తోటకూరి ఫౌండేషన్ చైర్మన్ పిచ్చయ్య తెలిపారు. ఇప్పటికే కారేపల్లి మండలంలో కారేపల్లి, రేగులగూడెం, గేట్ కారేపల్లి, గంగారాం తండాల్లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో దుబ్బతండా ఫౌండేషన్ సభ్యురాలు తోటకూరి సత్యకుమారి, గ్రామస్తులు మత్రు, బాష్యా, కోటేశ్వరరావు, శ్రీరాములు, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

'సీతారామ'ను వైరా రిజర్వాయర్‌కు కలపాలి

వైరా: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సీతారామ ప్రాజెక్ట్ లింక్ కెనాల్‌ను ఏన్కూరు మండలం తిమ్మరావుపేట రాజలింగాల మధ్యలో వైరా రిజర్వాయర్‌లోకి నీటిని అందించే ఏటికి కలపాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. వైరా మధ్యతరహా ప్రాజెక్ట్ రూపశిల్పి ప్రముఖ ఇంజనీర్ అయిన మీర్ అలీ నవాబ్ జంగ్ బహదూర్ జయంతిని పురస్కరించుకుని వైరాలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటి కరువు పరిస్థితులలో తక్కువ ఖర్చుతో శతాబ్దాల తరబడి నిలిచి ఉండేలా వైరా రిజర్వాయర్‌కు రూపకల్పన చేసిన ఘనుడు జంగ్ బహదూర్ అన్నారు. సీతారామ బ్యాక్ వాటర్ ద్వారా గోదావరి జలాలు వైరా రిజర్వాయర్‌లోకి చేర్చడం ద్వారా వేలాది మంది రైతులకు న్యాయం చేసినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రామారావు, చలపతిరావు, సుధాకర్, నాగేశ్వరరావు, వీరభద్రం, మల్లిఖార్జున్, మధు, సాంబశివరావు, రామకృష్ణ, రవి, రమణ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవం



నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్క నాటుతున్న అధ్యాపకులు

చింతకాని: వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఇంజం కృష్ణార్జునరావు, అధ్యాపకులు రాంబాబు, మల్లయ్య, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

తల్లాడ: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం తల్లాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో వనమహోత్సవం నిర్వహించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయులు, డిస్ట్రిక్ట్ కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు, హెచ్ఎం ప్రసూన, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

బోనకల్: మండలంలోని రైతుల భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తోట రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో సీపీఐ సర్వే చేసిందని 70శాతం సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. దీంతో పాటు అనేక ఇరిగేషన్ సమస్యలు ఉన్నాయని, సమస్యల పరిష్కారానికి ఈ నెల 15న తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు రవికుమార్, నాగేశ్వరరావు, రోషన్‌కుమార్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారుడు నరేందర్‌రెడ్డిని కలిసిన మువ్వా



నరేందర్‌రెడ్డికి మొక్కను అందజేస్తున్న మువ్వా విజయబాబు

సత్తుపల్లి: రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు గురువారం హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట డీసీసీబీ డైరెక్టర్ తుశ్లూరి బ్రహ్మయ్య, నాయకులు ఉన్నారు.

ఎంపీ రామసహాయం, మువ్వాకు అభినందనలు

సత్తుపల్లి: ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబులను గురువారం హైదరాబాద్‌లో సత్తుపల్లి మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ మట్టా ప్రసాద్ కలిసి సత్కరించి అభినందనలు తెలిపారు. పదవులు చేపట్టినందుకు శుభాకాంక్షలు తెలిపారు.


సీఏలో ఉత్తీర్ణత సాధించిన ఉమామహేష్

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ అంకసాల శ్రీనివాసరావు కుమారుడు అంకసాల ఉమామహేష్ బుధవారం విడుదల చేసిన సీఏ(చార్టడ్ అకౌంట్)ఫైనల్ ఇయర్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించాడు. ఈ సందర్భంగా ఉమామహేష్‌కు.. ఎస్‌జేకేఎం కళాశాల కరస్పాండెంట్ దండెం సత్యనారాయణరెడ్డితో పాటు పలువురు అభినందనలు తెలిపారు.

జగన్మోహన్‌రావు మృతికి సంతాపం

సత్తుపల్లి: వ్యవసాయశాఖ అధికారిగా వివిధ హోదాల్లో పనిచేసి విశ్రాంత జీవితాన్ని గడుపుతున్న కె.జగన్మోహన్‌రావు మృతిపట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తమ సంతాపాన్ని తెలిపింది. గురువారం ఆయన భౌతికకాయం వద్ద నివాళి ఘటించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చెంచిరెడ్డి, కేశవరెడ్డి, బద్రుద్దీన్, సుబ్బారావు, ప్రకాశరావు, వెంకటరత్నం తదితరులు ఉన్నారు.

వాగ్దానాల అమలు కోసం ఉద్యమాలు



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

మధిర: కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలుచేయాలనే డిమాండ్‌తో ఉద్యమించాలని మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మధిరలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం పేదలు ఏళ్లుగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. అర్హులందరికీ తెల్ల రేషన్ కార్డులు, ఇంటి స్థలం, గృహ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేయడమే కాక రైతుల రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని, ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు డిమాండ్‌తో ఈనెల 22న తహసీల్దార్ కార్యాలయాలు, 29న కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఎస్.వీ.రాకేష్, పుల్లయ్య, కంకణాల అర్జున్‌రావు, ఎలదండి బాబు, మందా సురేష్ తదితరులు పాల్గొన్నారు.